క్లుప్తంగా

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

లింగాల : మండలంలోని మురారిచింతల గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో అన్ని రకాల జబ్బులకు వైద్యసేవలు అందిస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల కేంద్రంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

చర్చి నిర్మాణానికి తోడ్పాటు



స్టీలు కడ్డీలను వితరణగా అందజేసిన జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

చింతకొమ్మదిన్నె : క్రైస్తవుల ప్రార్థనా మందిరమైన చర్చి నిర్మాణానికి అవసరమైన ఇనుప కడ్డీలను జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి వితరణగా అందజేశారు. మండలంలోని కొప్పర్తి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి నరేన్ రామాంజులరెడ్డి ఒక టన్ను స్టీల్ వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజల సౌకర్యార్థం ప్రతి గ్రామంలో కుల మతాలకు అతీతంగా ప్రార్థనా మందిరాలకు తన వంతు సహకారం అందిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, మండల నాయకులు నాగమల్లారెడ్డి, మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురుక్షేత్ర మహాసభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

పులివెందుల టౌన్ : కురుక్షేత్ర మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన కర్నూలులో నిర్వహించే ఎమ్మార్పీఎస్ కురుక్షేత్ర మహాసభను ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 10వ వార్షికోత్సవ సదస్సుకు ముఖ్య అతిథిగా పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరౌతారన్నారు. ఈ సదస్సుల్లో ఎమ్మార్పీఎస్ సమస్యలపై చర్చించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగభూషణం, కృష్ణమూర్తి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు సీఎం వైఎస్ జగన్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసి సామాజిక విప్లవకారునిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచిపోయారని మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్(ఎంబీసీ) రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా తెలిపారు. ఆదివారం కడప నగరం ఏడురోడ్ల కూడలి వద్ద ఉన్న ఎంబీసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేకమంది బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ద్వితీయ శ్రేణి నాయకులను రాజకీయంగా అందలం ఎక్కించిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. నవంబర్ 15 వ తేదీ నుండి కులాల వారీగా జన గణన చేయాలని ఆదేశాలు జారీ చేయడం పట్ల బీసీ కులాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎంబీసీ ప్రచార కార్యదర్శి కుళాయిప్ప, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పాపాసాహెబ్ పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలో శరన్నవ రాత్రుల మహోత్సవాలతో ఆలయాలకు కొత్త శోభ సంతరించుకుంది. చలువ పందిళ్లతో, విద్యుత్ దీపకాంతులతో మిరిమిట్లు గొలుపుతూ ఎంతో అందంగా ఆలయాలు ముస్తాబు చేశారు. దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మలగన్న అమ్మను దర్శించి తరించనున్నారు. తొలిరోజు ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీబాల త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే అంకాలమ్మ ఆలయంలో ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, ఈఓ రమణల ఆధ్వర్యంలో అంకురార్పణతో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం యమునా పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి ప్రార్థన, స్వస్తివాచన, కలశస్థాపన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, దీక్షా గణపతి హోమం నిర్వహించారు. సాయంత్రం జపవేద పారాయణం, సహస్ర నామార్చన, ఉభయదారులకు అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని శ్రీదీక్షాబంధని అలంకారంలో అందంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే స్థానిక శ్రీవేంకటరమణుడి ఆలయంలో మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వరదాచార్యులు ఉభయదారులచే ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మగా అచ్చవెల్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధిగాంచింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.



పులివెందులలో బాలత్రిపురసుందరీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



లింగాలలో గాయత్రిదేవి అలంకరణలో శ్రీదేవి భూదేవి అమ్మవార్లు

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలోని శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో యువజన సంఘం సహకారంతో ఆదివారం నవరాత్రి మహోత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఉదయం కమిటీ అధ్యక్షుడి నివాసం నుంచి అమ్మవారికి బంగారు కిరీటం, బంగారు చీర తదితర వాటిని ఊరేగింపుగా తీసుకువెళ్లి అలంకరించారు. శ్రీ చక్ర సమేత అష్టలక్ష్మీ పూజ చేశారు. సాయంత్రం అమ్మవారు మొదటి రోజు దీక్షాబంధన అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. సగళా భాస్కర్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టుచీరె సమర్పించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. శ్రీలలితా పరమేశ్వరిదేవి బాల త్రిపుర సుందరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి కాశీభట్ల సాయినాథశర్మ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. పెద్దచెప్పలిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నేటి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం వాసవి కన్యకాపరమేశ్వరి దేవి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారన్నారు. ఆలయంలో కలశస్థాపనతో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించామన్నారు. అనంతరం వాసవిమాతకు అభిషేకం నిర్వహించి మహామంగళ హారతిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగమ్మతల్లి, గడ్డంవారిపల్లెలోని రాజరాజేశ్వరి, అమర లింగేశ్వర స్వామి, సంగమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. పాడటి రోజు గంగమ్మతల్లి లక్ష్మిదేవి, సంగమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి, గడ్డంవారిపల్లెలో బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు పాత ఊర్లోని చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారిని గౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. మొదటి రోజు కావడంతో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని శ్రీమత్ కన్యకాపరమేశ్వరీ దేవి, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి, శ్రీ చౌడేశ్వరీదేవి, ఆలయాల్లో ఆదివారం అమ్మవారు భక్తులకు శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీదేవి ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. చౌడేశ్వరి ఆలయంలో మూల విరాట్ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీ వాసవి కనకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర నుంచి ఆర్యవైశ్యులు వాసవి మాత కలశంతో దేవస్థానం వరకు ఊరేగింపుగా వచ్చారు. అనంతరం అమ్మవారు దీక్షాబంధన అలంకారంలో దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని శ్రీమదంబాభవాని, కన్యకాపరమేశ్వరి, శ్రీచౌడేశ్వరిదేవి, జంబులింగేశ్వర, లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, రాజరాజేశ్వరి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీమదంబా భవాని అమ్మవారు గీతోపదేశ అలంకారంలో, జంబులింగేశ్వర, కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో, శ్రీరాజరాజేశ్వరిదేవి బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ఆదివారం రాత్రి శ్రీ దీక్షా బంధన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మొదటి రోజు ఆలయంలో గణపతి హోమము, జపాలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం పార్నపల్లి కోనమల్లేశ్వరస్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు గాయత్రిదేవి అలంకరణ గావించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదపండితులు అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లి సమీపంలో ఉన్న ఆలయంలో నవరాత్రుల్లో భాగంగా ఆదివారం మొదటి రోజు అమ్మవారు స్వర్ణగౌరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ చైర్మన్ బీపీ విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ ఈఓ పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్ని విధాల ఏర్పాట్లు చేశారు. ఉదయాన్నే భక్తులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఎర్రగుంట్లలో రాజరాజేశ్వరిదేవి అలంకారణలో అమ్మవారు




కమలాపురంలో దీక్షా బంధన అలంకారంలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరీదేవి



వీఎన్‌పల్లె : లక్ష్మిదేవి అలంకరణలో గంగమ్మతల్లి



జమ్మలమడుగులో గీతోపదేశ అలంకారంలో మదంబా భవాని



ముద్దనూరులో శ్రీ దీక్షాబంధన అలంకారములో అమ్మవారు

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

వీరపునాయునిపల్లె : ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అనిమెల గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్‌క్లీనిక్ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు గ్రామంలోనే వైద్యం అందించాలన్న సంకల్పంతో రూ.18 లక్షలతో విలేజ్ క్లీనిక్ భవనాలను ఏర్పాటు చేస్తున్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని చూసించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కాంట్రాక్టర్ శ్రీనివాసుల్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లై డైరక్టర్ గోపాల్‌రెడ్డి, అనిమెల సర్పంచు నరేష్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాఘవ యాదవ్, స్థానిక నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, శంబురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేజ్ క్లీనిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఎర్రగుంట్ల : చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దూరం అవుతాయని ఎంపీడీఓ రంతుల్లయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని చిలంకూరు గ్రామ పంచాయతీలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి రోజు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మెప్మా ఆధ్వర్యంలో కొట్టంబడి స్కూల్‌లో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించినట్లు సీఓ వసంత రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మహిళలకు అవగాహన కల్పించారు.

చెన్నూరులో..

చెన్నూరు : ప్రతి ఒక్కరూ పరిసరాల పట్ల బాధ్యత, ఆరోగ్యం పట్ల ప్రమాణాలను పాటించినట్లయితే రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దవచ్చని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన గ్లోబల్ వాషింగ్ డే (ప్రపంచ చేతులు పరిశుభ్రత దినము) నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారిణి శకుంతల, ఏపీఎం గంగాధర్, మహిళా వీఓఏలు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రంతుల్లయ్య

అబ్దుల్ కలాం అంకితభావం ఆదర్శం

కడప అగ్రికల్చర్ : అబ్దుల్ కలాం అంకితభావం, దేశభక్తి, నిజాయితీ, కష్టపడేతత్వం నేటి యువతకు ఆదర్శం అని కడప డీసీసీ బ్యాంకు ఓఎస్‌డీ, డిప్యూటీ రిజిస్ట్రార్ బి. గుర్రప్ప అన్నారు. ఆదివారం కడపలోని డీసీసీ బ్యాంకులో అబ్దుల్‌కలాం 92వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన రాష్ట్రపతిగా దేశ ప్రజల మన్ననలు పొందారన్నారు. అలాగే భారతదేశ రక్షణ రంగానికి అత్యంత బలీయమైన క్షిపణులు, అణుపరీక్షలు, రక్షణ విమానాలతో భారతదేశాన్ని ప్రపంచంలోనే బలమైన సైనికశక్తిగా రూపొందించారన్నారు. కేవలం రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగానే కాకుండా కలాం ఉపాధ్యాయుడిగా తన బోధనలతో లక్షలాది మంది దేశ, విదేశీ విద్యార్థులను ప్రభావితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మొహిద్దీన్‌ఖాన్‌కు వెంపటి చినసత్యం స్మారక పురస్కారం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు పి.మొహిద్దీన్‌ఖాన్‌కు వెంపటి చినసత్యం స్మారక పురస్కారం లభించింది. కృష్ణాజిల్లా కూచిపూడి సిద్దేంద్రయోగి కళాక్షేత్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ కృష్ణాజిల్లా యంత్రాంగం, సేవ్ కూచిపూడి ఆర్ట్ అకాడమి చెన్నై, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జయహో భారతీయం ఆధ్వర్యంలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత వెంపటి చినసత్యం జయంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకలో మొహిద్దీన్ ఖాన్ కూచిపూడి నాట్యానికి చేసిన సేవలకు, అభివృద్ధికి పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి ఆర్‌కే రోజా, గృహ నిర్మాణ శాఖామంత్రి జోగిరమేష్, ఎమ్మెల్యే అనిల్ కుమార్‌లు ఈ పురస్కారం అందుకున్నారు.

కులాల వారీగా జన గణన

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాల వారీగా జన గణన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 15 నుంచి కులాల వారీగా జన గణన ప్రారంభించడంతో బీసీ కుల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూరుబాషా సంఘం కార్యాలయంలో ఆదివారం నూరుబాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ ఆధ్వర్యంలో బీసీ సంఘ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ద్వితీయ శ్రేణి నాయకులను కూడా అనేక మందిని రాజకీయంగా అందలం ఎక్కించిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సామాజిక బస్సు యాత్ర చేపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి బీసీ కులాలందరు సంఘీభావం తెలిపాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ కుల సంఘ నాయకులు చంద్రమౌళి, రాజేష్, రమణ, చంద్రమౌళీలు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కమలాపురం : కృష్ణా జలాలపై ఈనెల 18న కడపలో జరుగుతున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం కమలాపురంలో ఆయన పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. కృష్ణా జలాలతో రాజకీయం చేస్తూ ఏపీ భవిష్యత్తును, సీమ ప్రాజెక్టులను అంధకారంలోకి నెట్టేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకించాలన్నారు. ఏపీలో మిగులు జలాలపై ఆధార పడిన గాలేరు–నగరి, హంద్రీ నీవా, వెలుగోడు, బ్రహ్మసాగర్ ప్రాజెక్టులకు నీరు రాకుంటే ఈ ప్రాంతమంతా ఎడారిగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కడపలో జరిగే రాష్ట్ర సదస్సుకు మేధావులు, రైతులు, పార్టీల కతీతంగా కర్షకులు, కార్మికులు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

శిల్పారామంలో దసరా సంబరాలు



శాస్త్రీయ నృత్యప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆదివారం సాయంత్రం మదనపల్లి సూర్య డ్యాన్స్ అకాడమి మాస్టర్ సూర్య శిష్యబృందంతో వెస్ట్రర్న్ నృత్యప్రదర్శనలు నిర్వహించారు. జానపద, శాస్త్రీయ నృత్యాలతో ప్రత్యేకంగా చిన్నారులు ఆకట్టుకున్నారు. తదితర పాటలకు నృత్యాలు వేసి ఎంతగానో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

మల్చింగ్ విధానంపై రైతుల ఆసక్తి

పులివెందుల రూరల్ : మల్చింగ్ విధానంపై రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. బిందు, తుంపర సేద్యాల తరహాలో ఈ మల్చింగ్ విధానంపై ఇప్పుడిప్పుడే రైతన్నలు వివిధ పంటలు సాగుచేసేందుకు ఉత్సాహం కనపరుస్తున్నారు. ఈ విధానం ఎంతో లాభదాయకమని రైతులు అంటున్నారు. ఈ సరికొత్త ప్రయోగం ద్వారా ఆశించిన ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నట్లు రైతులు అంటున్నారు. మొక్క చుట్టూ వ్యాపించి ఉన్న వేరు వ్యవస్థను ఏదైనా పదార్థాలతో కప్పడాన్ని మల్చింగ్ విధానం అంటారు. కృత్రిమంగా తయారుచేసే ప్లాస్టిక్ షీట్‌తోనూ మల్చింగ్ చేసే అవకాశం కూడా ఉంది. ఈ పద్ధతులను ఉపయోగించడం ద్వారా భూమిలోని తేమను సంరక్షించడంతో పాటు కలుపు నివారణ, నేలకోతకు గురికాకుండా కాపాడుకోవచ్చని రైతులు అంటున్నారు. ఈ రసాయన ఎరువులు, సంరక్షణకు అయ్యే ఖర్చులు 20 శాతానికి పైగా ఆదా చేసుకునే అవకాశం ఉంది. ఈ పద్ధతి నేల ఉపరితలాన్ని కప్పి ఉంచడంతో పాటు రక్షణగా ఉండటంతో పాటు తేమను కాపాడటం, కలుపుదల మొక్కలను అణచి వేయడం, ఉష్ణోగ్రత నియంత్రించడం జరుగుతుంది. అలాగే ఈ నేల కోతను తగ్గించడం వంటి అనేకరకమైన ప్రయోజనాలు ఈ విధానం అందిస్తుంది. ఈ మల్చింగ్ విధానానికి ఎక్కువగా ప్లాస్టిక్ పట్టలను ఉపయోగిస్తారు. ఒక్కో కట్ట 400 మీటర్లు ఉంటుందని, వీటి విలువ రూ.1000ల నుంచి నాణ్యతను బట్టి రూ.1500ల వరకు ఉంటుంది. ఎకరా సాగు విస్తీర్ణం ఆధారంగా 5 లేదా 6 ప్లాస్టిక్ పట్టలను ఎకరాకు ఉపయోగిస్తారు. ఇలాంటి వ్యవసాయ విధానంలో మల్చింగ్ పద్ధతిని పాటించే రైతులకు ప్రభుత్వం కాస్త వెసలుబాటు కల్పిస్తే బాగుంటుందని రైతన్నలు అంటున్నారు. బిందు, తుంపర సేద్యాల తరహాలో మల్చింగ్‌కు ఉపయోగించే ప్లాస్టిక్ పట్టలకు రాయితీ అందిస్తే ఎక్కువ మంది రైతులు మల్చింగ్ విధానంలోనే పంటలు సాగు చేసేందుకు ఆసక్తి కనపరుస్తారు.



మల్చింగ్ విధానంలో సాగుచేసిన పంట

సాహస పర్యాటకంపై వర్క్‌షాప్

వేంపల్లె : సాహస పర్యాటకంపై ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఏసీ ఏపీ ఫౌండర్ రంగారావు, ప్రెసిడెంట్ మోహన్‌రావులు తెలిపారు. 1991లో స్థాపించబడిన మొట్టమొదటి సాహస క్రీడల సంస్థ ఏసీ ఏపీ ఇప్పటివరకు సుమారు 32 సంవత్సరాలుగా 6 లక్షల మంది విద్యార్థులు, యువకులు కార్పొరేట్ వారికి వివిధ సహస క్రీడల్లో శిక్షణ ఇచ్చిందన్నారు.

ఈ నేపథ్యంలో సాహస పర్యాటకంపై యువతకు అవగాహన కల్పించడానికి డాక్టర్ వైఎస్సార్ అడ్వెంచర్ టూరిజం లీడర్ షిప్ వర్క్‌షాప్‌ను గండి క్షేత్రం వద్ద ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఉత్తమంగా నిలిచిన 10 మంది యువకులకు అక్టోబర్ 29న ఇడుపులపాయ వద్ద పూర్తి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువకులు సొంత యూనిట్స్ చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో పాల్గొనేవారు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయసు వారై ఉండాలన్నారు. కానీ వీరికి కనీసం వ్రాయడం, చదవడం తెలిసి ఉండాలన్నారు. అంతేకాకుండా నుహ్రూ యువకేంద్రం అనుబంధం యువజన సంఘాలు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వారు కూడా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 25లోపు తమ వివరాలను వాట్సాప్ నెంబర్ 9849270575కు పంపాలని కోరారు.

వాణిజ్యశాస్త్రం కోర్సుకు చక్కటి అవకాశాలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని వాణిజ్యశాస్త్ర విభాగంలో ఎంకాం కోర్సు పూర్తి చేయడం ద్వారా వాణిజ్యరంగంలో చక్కటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. వైవీయూలోని ఎంకాం కోర్సుల్లో ప్రవేశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఏపీ పీజీసెట్–23 ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రవేశాలు పొందాలని సూచించారు. పీజీ రెండేళ్ల కోర్సు పూర్తికాగానే ఉన్నత శ్రేణి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయంలోని గురుకులం అధునాతన భవనాల్లో డిజిటల్ విధానంలో తరగతుల నిర్వహణ, అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్, సుదీర్ఘ బోధన అనుభవం కలిగిన ఆచార్యుల బృందం మార్గదర్శకత్వం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందన్నారు. ఏపీ పీజీసెట్–23 అర్హత సాధించిన విద్యార్థులు వైవీయూ కామర్స్ విభాగంలో చేరాలని సూచించారు. పూర్తి వివరాలకు కామర్స్ విభాగాధిపతి ఆచార్య జి. విజయ భారతిని సంప్రదించాలని సూచించారు.



విద్యార్థులకు బోధిస్తున్న అధ్యాపకులు